క్లుప్తంగా

విద్యార్థుల్లో జనరల్ నాలెడ్జ్ పెంపొందాలి



మైలవరం: విద్యార్థులు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కలిగి ఉండాలని శ్రీ లీలావతి హైస్కూల్ ఉపాధ్యాయిని ఎస్‌కే సైదాబీ అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులతో కథలు చదివించి, కథలు చెప్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని, జనరల్ నాలెడ్జ్ పెంచుకునేందుకు కావలసిన మెటీరియల్ ఇక్కడ లభిస్తుందని చెప్పారు. మేధావుల పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి బోరు తొలగింపు

తిరువూరు: పట్టణంలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్న సమయంలో నగర పంచాయతీ అధికారులు బోర్లను తొలగిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రజావసరాల కోసం నిర్మించిన బోర్లకు మరమ్మతులు చేయకుండా వదిలేసిన అధికారులు ఇప్పుడు వాటిని పూర్తిగా నిర్మూలిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఏడో వార్డులో శనివారం ఒక బోరును నగర పంచాయతీ సిబ్బంది తొలగిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. కలెక్టర్ ఆదేశాలున్నాయంటూ సిబ్బంది ఆ బోరును తొలగించడంపై వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి



లక్ష్మీపురం(తిరువూరురూరల్): వేసవి ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఆర్డీఓ మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకుని బయటకు రావాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రవిబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శికి సన్మానం



చాట్రాయి: పారిశుద్ధ్య పనుల్లో మండల స్థాయిలో చాట్రాయి గ్రామ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం స్వచ్ఛ ఆంధ్రా, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ దామెర ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి నాగరాజుని ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక సచివాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

తిరువూరు: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోవద్దని జన విజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 20 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాల సందర్శన, విహార యాత్రలు చేయాలని, శాస్త్రీయ విజ్ఞానం కోసం సైన్స్ పుస్తకాలు చదవాలని సూచించారు. వేసవి శిక్షణా తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. జేవీవీ సభ్యులు పాపారావు, రాంప్రదీప్, సుదర్శన్, జగన్మోహనరావు, శోభన్‌బాబు, సుబానీ, సుధాకర్ పాల్గొన్నారు.

రక్తపోటు నియంత్రణపై అవగాహన

ఆగిరిపల్లి: ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జగన్‌మోహన్‌రావు, టీనా ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తపోటు నియంత్రణకు చేపట్టవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. రక్తపోటును నివారించడానికి ప్రజలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

హామీల అమలు ఎప్పుడు బాబూ!

- ఆటోవాలాలకు రూ. 15వేలు ఇస్తామని కూటమి నేతల హామీ
- అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఊసేలేని వైనం
- ధరల పెరుగుదల, కిరాయిలు లేక ఆటోవాలాల ఇబ్బందులు
- హామీల అమలు కోసం ఆటోవాలాల ఎదురుచూపు



ఆగిరిపల్లిలోని స్టాండ్ వద్ద ఆటోవాలాలు

ఆగిరిపల్లి: అధికారం కోసం బూటకపు హామీలు ఇవ్వడం.. ఎన్నికలకు ముందు ఒక మాట, తరువాత మరో మాట చెప్పడం, అధికారం చేజిక్కించుకున్న తరువాత హామీలను అటక ఎక్కించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మించిన వారు లేరని ప్రజలు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు చెప్పిన మాయమాటలకు అన్ని వర్గాల ప్రజల మాదిరిగానే తాము కూడా మోసపోయామని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ప్రతి సంవత్సరం రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పిస్తామని కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొంది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వీటిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికావస్తున్నా ఈ హామీలు అమలుకు నోచుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయమైనా అందించాలని ఆటో డ్రైవర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మండలంలో 250 ఆటోలు ఉన్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోల పైన ఆధారపడి గమ్యస్థానాలకు చేరుకుంటారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికులకు రోజంతా కష్ట పడితే కనీసం రూ.200 నుంచి రూ.300 వరకు కూడా మిగలని పరిస్థితి. ప్రతి సంవత్సరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల వరకు ఖర్చవుతోంది. దీంతో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు చేసి వేల రూపాయలు జరిమానాలను విధిస్తున్నారు. ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ వాయిదాలు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బులు ఇంధనం, ఇతర ఖర్చులకు సరిపోతున్నాయని వాపోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా అందించే వారు. అలాగే రవాణా వాహనం కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని డ్రైవర్లకు రూ.3 లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు.

కార్మికులు

డ్రైవర్ సాధికార సంస్థ ఏర్పాటు చేసి అన్ని వర్గాల డ్రైవర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాల అమలు - డ్రైవర్లను ఓనర్లు చేసే లక్ష్యంతో వాహన కొనుగోళ్లకు రూ.4 లక్షల వరకు పొందే రుణాలపై 5% ఫైబడిన వడ్డీ సబ్సిడీ
బ్యాడ్జ్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు, ట్యాక్సీ డ్రైవర్లకు, హెవీ లైసెన్స్ కలిగిన ప్రతి లారీ, టిప్పర్ డ్రైవర్‌కు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం
జీవో 21 రద్దు చేసి ఫైన్‌ల భారం తగ్గింపు

ఆటోవాలాలకు కూటమి ఇచ్చిన హామీలు

రూ.15 వేలు ఇవ్వాలి



రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆటోల ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం, రోడ్డు ట్యాక్సులు కట్టుకోలేక సతమతమవుతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి.

– బి.చిన్ని, ఆటో కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు, ఆగిరిపల్లి

కుటుంబ పోషణ భారం..



12 ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంతగా గిరాకీ ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా సాయం చేయాలి. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

–పి. చంటిబాబు, ఆటో డ్రైవర్, ఈదులగూడెం

సారా రహిత మండలంగా రెడ్డిగూడెం

తహసీల్దార్ జె.సుశీలాదేవి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ రమణ, తహసీల్దార్ సుశీల తదితరులు

మైలవరం: రెడ్డిగూడెం మండలాన్ని సారా రహిత మండలంగా తీర్మానం చేశామని తహసీల్దార్ జె.సుశీలాదేవి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుశీలాదేవి అధ్యక్షతన శనివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా రెడ్డిగూడెం మండలంలో సారా ప్రభావిత గ్రామాలైన రెడ్డిగూడెం, అన్నేరావుపేట, ఓబులాపురం, రుద్రవరం, ముచ్చినపల్లి, మద్దులపర్వ తదితర గ్రామాల గ్రామ కమిటీలు ఆయా గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్మానం చేసిన దరిమిలా మండలంలో సారా ప్రభావంపై చర్చించి మండలం మొత్తాన్ని సారా రహిత మండలంగా ప్రకటిస్తూ తీర్మానం చేశారు. ఎంపీడీఓ రమణ, ఎస్ఐ మోహనరావు, ఏపీఎం వెలుగు రామకృష్ణ, ఇరిగేషన్ శాఖ ఏఈఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

జి.కొండూరు: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేని ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను, వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్టు చేయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్‌రెడ్డిల అరెస్టును ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. దాడులు, కేసులు, దౌర్జన్యాలతోనే ఈ ప్రభుత్వం సంవత్సర కాలం వెళ్లదీసిందని విమర్శించారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఐదేళ్లు అహర్నిశలు పాటుపడిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేసేందుకే ఒక క్రమ పద్ధతిలో అక్రమ కేసులకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

ఎంవీఐ నాగమురళి



జి. నాగమురళి

నూజివీడు: పాఠశాలలు, కళాశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. నాగమురళి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంకా ఎవరైనా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోని వారు ఉంటే పాఠశాలలు తెరిచే లోగా చేయించుకోవాలన్నారు. నూజివీడు ప్రాంతీయ రవాణా శాఖ పరిధిలో సుమారు 120 ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరంలో స్కూల్ బస్సులను నడపాలంటే కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాల, కళాశాల బస్సుల్లో మెడికల్ కిట్, డ్రైవర్, క్లీనర్, ఫైర్ సర్టిఫికెట్, బస్సు తిరిగే రూట్ మ్యాప్ ఉండాలని చెప్పారు. స్కూల్ యాజమాన్యం వారు ఫిటినెస్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేసుకుంటే మిగతా ప్రక్రియ ఆర్టీఏ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని చెప్పారు. మద్యం తాగే అలవాటు, చూపు మందగించిన వారిని బస్ డ్రైవర్లుగా నియమించకూడదన్నారు. డ్రైవర్లు రవాణా శాఖ నిర్వహించే శిక్షణకు హాజరు కావాలన్నారు. బస్సులో తప్పనిసరిగా ఫిర్యాదుల పుస్తకం ఉండాలని, బస్సులను విద్యా సంస్థ స్థలంలోనే పార్కింగ్ చేయాలని చెప్పారు. వీటన్నింటిని పర్యవేక్షించిన అనంతరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నూజివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వెంకట్రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నూజివీడు పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణను సీఐ ఎ. మస్తానయ్య ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా నిర్వహించాలి

ముసునూరు: స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహించాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. శనివారం గ్రామ సచివాలయాల పరిసరాలను సర్పంచ్‌ల అధ్యక్షతన శుభ్రం చేయించారు. ముసునూరు ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ (వర్షపు నీటిని నిల్వ చేయు) విధానాన్ని ఆమె ప్రారంభించారు. ఎంపీడీఓ బీఏ సత్యనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా స్వచ్ఛతకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. కొర్లగుంట, వేల్పుచర్ల సర్పంచ్‌లు సత్యనారాయణ, మోహనరావు, తహసీల్దార్ కేవీ రమణ, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో..

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత అనేది తమ ఇంటి నుంచి ప్రారంభించాలన్నారు. అనంతరం ఎ.కాలనీ, సి. కాలనీ వీధుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత చేపట్టాలన్నారు. చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చలివేంద్ర కేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీఎం సూర్యపవన్‌కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు



నూజివీడు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్



ఎన్టీటీపీఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు



ఆగిరిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

- కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ప్రజలు తమ ఇంటి ఆవరణలో మొక్కను నాటాలని కొత్తూరు తాడేపల్లి సర్పంచి ఉయ్యూరు గోపాలరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కె.తాడేపల్లి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలను నాటి మాట్లాడారు. కార్యదర్శి దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. జక్కంపూడి గ్రామ సచివాలయ ఆవరణలో కార్యదర్శి కె.లక్ష్మి, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు. పైడూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో, రాయనపాడు గ్రామంలో మొక్కలు నాటారు.

పరిసరాల శుభ్రత.. సామాజిక బాధ్యత

ఆగిరిపల్లి: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరించాలని ఎంపీడీఓ ఆనంద్‌బాబు అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వడ్లమానులో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించారు.

కొండపల్లి వద్ద జాతీయ రహదారి జలమయం



జాతీయ రహదారిపై వర్షం నీరు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి కొండపల్లి శాంతినగర్ వద్ద 30వ నంబర్ జాతీయ రహదారిపైకి భారీగా వర్షం నీరు చేరింది. శనివారం నాటికి కూడా రోడ్డుపై వర్షం నీరు తగ్గకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రదేశంలో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలవడం నిత్యకృత్యంగా మారింది. జాతీయ రహదారుల అభివృద్ధి శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హైవేపై వర్షం నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధి కూలీలు పని దినాలు పూర్తి చేయాలి

ముసునూరు: ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలందరూ తప్పనిసరిగా తమకు కేటాయించిన పని దినాలు పూర్తి చేయాలని ఏపీఓ రోజ్‌లీల అన్నారు. మండలంలోని గోపవరంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆమె సందర్శించి, ఉపాధి మేట్లు, కూలీల హాజరును తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న ఎంఐ ట్యాంక్, సేద్యపు నీటి గుంటను, ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలంతా ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకుని పని చేయాలని, మస్టర్ రిజిస్టర్లో కూలీలు సంతకాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ

లక్ష్మీపురం(తిరువూరురూరల్): గేదెలు రోడ్లపై సంచరించడం, నడిరోడ్డులో తిష్ట వేయడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున వాటి కొమ్ములకు రేడియం స్టిక్కర్లు వేయించే కార్యక్రమం చేపడుతున్నామని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో శనివారం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల వేతన కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా ఎస్ఐ పలు సూచనలు చేశారు. గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు వేయించడం వలన రాత్రివేళల్లో వాహన చోదకులు వాటిని గుర్తించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించవచ్చన్నారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు ఈ రేడియం స్టిక్కర్లు వేసే కార్యక్రమానికి తగు సహకారం అందించాలని కోరారు. తిరువూరు సెక్టార్ మేనేజరు సాంబశివమూర్తి, పాల ఉత్పత్తిదారుల సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జి.కొండూరు: గ్యాస్ ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు అన్నారు. జి.కొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్‌ల వద్ద ప్రమాదాలు జరిగినపుడు మంటలను అదుపు చేసే విధానాన్ని అగ్నిమాపక సిబ్బంది స్థానికులకు డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



విస్సన్నపేటలో రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వ్యాను

విస్సన్నపేట: మినీ వ్యానులో అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విస్సన్నపేట పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని వీఎం బంజరలో రేషన్ బియ్యం 45 క్వింటాళ్లు కొనుగోలు చేసి మర్లపాలెంలో కోళ్లఫారానికి విక్రయించి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మినీ వ్యాన్ యజమాని ధనికొండ గోపిరాజు, డ్రైవరు నక్కా వేణుగోపాలకృష్ణలపై పీడీఎస్ డెప్యూటీ తహసీల్దారు శివనాగరాజు కేసు నమోదు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జి.కొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 15 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5.65 లక్షల చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేతుల మీదుగా లబ్ధిదారులకు గొల్లపూడిలో శనివారం అందజేశారు. కూటమి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చాట్రాయి తహసీల్దార్‌గా ఈశ్వరరావు

చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్‌గా ఈశ్వరరావు (ఎఫ్ఏసీ) శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ప్రశాంతిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆమెను సస్పెండ్ చేసి తాత్కాలిక తహసీల్దార్‌గా రీ సర్వే డీటీ గీతను నియమించిన విషయం తెలిసిందే.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత

ఆగిరిపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆగిరిపల్లి వాసవి మహిళా మండలి సభ్యులు వాటర్ ప్యూరిఫయర్ బహూకరించారు. వాసవి మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు యండూరి లక్ష్మీ భవాని రూ.20 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను వైద్యులు టీనా, జగన్ మోహన్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులకు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీకి పాము కాటు

మైలవరం: టి.గన్నవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్న వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు. మైలవరం మండలం చంద్రాల గ్రామ పంచాయతీ శివారు టి.గన్నవరం గ్రామానికి చెందిన మర్రి బాపయ్య గ్రామంలోని చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. చెరువులో మట్టి తవ్వుతుండగా బాపయ్యను పాము కరిచింది. వెంటనే అతనిని ఫీల్డ్ అసిస్టెంట్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

నూజివీడు బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు

నూజివీడు: వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలోని బస్టాండులో రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ శనివారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర, సభ్యులు మూల్పూరి లక్ష్మణస్వామి, సబ్బినేని శ్రీనివాస్, బోయపాటి ముఖర్జీ పాల్గొన్నారు.